## 7వ వారము - సభ్యుల విభాగము

## నామామృతం

***రాక్షసుల్ని నాశనము చేసి భక్తులను రక్షించుటకు కృష్ణుడు ఇప్పుడు హరే కృష్ణ ఉద్యమము ద్వారా తన పవిత్ర నామమున అవతరించాడు.***

(శ్రీకృష్ణునితో వసుదేవుడు) ఓ నా తండ్రీ, నీవు సర్వ సృష్టికి యజమానివి. ఈ ప్రపంచమును రక్షించుటకుగాను నీవు నా గృహమున ఆవిర్భవించావు. నిజానికి రాక్షసులైనప్పటికీ, క్షత్రియుల వలె ధరించివున్న రాజకీయ వేత్తల ఆధీనములో, ప్రపంచమంతటా తిరుగుతున్న సైన్యములన్నిటినీ నీవు చంపెదవని నాకు నిశ్చయముగా తెలుసు. అమాయకులైన ప్రజల రక్షణ కొరకు వారు నీ చేత చంపబడాలి.

కృష్ణుడు ఈ ప్రపంచమున రెండు ఉద్దేశముల కొరకు ఆవిర్భవిస్తాడు. *పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చదుష్కృతాం* (భ.గీ. 4:8) అమాయకులను భగవంతుని ధర్మపరమైన భక్తులను రక్షించుటకు ఇక రాజకీయ అధికారము కొరకు అనవసరముగా వారిలో వారు పోట్లాడుకుంటూ కుక్కలవలె మొరిగే విద్యలేని అనాగరిక అసురులందరినీ నాశనము చేయుటకు. *కలి కాలే నామ రూపే కృష్ణావతార* అని చెప్పబడినది.

హరే కృష్ణ ఉద్యమము కూడా పవిత్రనామ రూపమైన కృష్ణుని అవతారమే (నామ రూపే). నిజానికి రాక్షస నాయకులు మరియు రాజకీయ వేత్తలకు భయపడే మనలోని ప్రతి ఒక్కరము ఈ కృష్ణుని అవతారమును: *హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే* - తప్పక ఆహ్వానించాలి. అప్పుడు మాత్రమే రాక్షస నాయకులు పెట్టే బాధల నుండి మనము తప్పక రక్షించబడతాము. ప్రస్తుత సమయమున నాయకులు చాలా శక్తిమంతులు. ప్రభుత్వములోని అత్యున్నత పదవులను స్వాధీనపరచుకుని, లెక్కలేనంత మందిని దేశ రక్షణకని లేదా ఏదో ఒక అత్యవసర నెపముతో బలిచేస్తున్నారు. ఆ తర్వాత తిరిగి ఒక అసురుడు, మరొక అసురుడు జయిస్తున్నాడు. కాని ప్రజలు బాధలనుభవించుట మాత్రమే కొనసాగుతూనే ఉంటుంది. అందుచేత సమస్త ప్రపంచము అనిశ్చియమైన స్థితిలో ఉన్నది కేవలం ఈ హరే కృష్ణ ఉద్యమము ఒక్కటే ఉన్న ఒక శరణ్యం.

***శ్రీమద్భాగవతము 10:3-21***

## చర్చ - విషయ విభాగము

## *ఆధ్యాత్మిక ఆచార్యుని ద్వారా వేదముల నుండి నేర్చుకొనండి*

వైదిక గురు పరంపరలో ఆధ్యాత్మిక గురువులు ఎల్లప్పడు వారు ప్రామాణిక మూలముల నుండి విన్న వాటి ఆధారముగా ప్రవచనములు చేయుదురు. కాని స్వానుభవం మీద ఎప్పడూ ఆధారపడరు. స్వానుభవం ద్వారా విషయాలను అర్థం చేసుకొనే ప్రయత్నం చేసి తద్వారా జ్ఞానాన్ని పొందడమనేది భౌతిక ప్రక్రియ. దీనినే శాస్త్రీయ పరిభాషలో "ప్రత్యక్ష" అంటారు. అయితే వైదిక విధానం వేరు. దీనిని "శృతి" అంటారు. అంటే ప్రామాణిక ఆధారాల నుంచి వినబడినటువంటిది అని. ఇదే వైదిక అవగాహనలోని రహస్యం.

అసమగ్రమైన మీ ఇంద్రియాలతో ప్రయోగపు పరిధులకు అతీతంగా ఉండే విషయములను అర్థం చేసుకొన ప్రయత్నించకూడదు. అది సాధ్యం కాదు. మీ తండ్రి ఎవరో తెలుసుకోవాలనుకోండి. ప్రయోగము ద్వారా మీరు ఆ విషయాన్ని కనుగొనగలరా? అది సాధ్యమేనా? కాదు. అటువంటప్పడు మీ తండ్రి ఎవరో మీరెలా తెలుసుకోగలరు? సరియైన ప్రమాణము ద్వారా అనగా మీ తల్లి ద్వారా. ఇది అందరికి ఉండే జ్ఞానమే. భౌతికమైన మీ తండ్రిని మీరు ప్రయోగపద్ధతిలో తెలుసుకోలేనప్పడు ఆ పరమపితను ఏ విధంగా తెలుసుకోగరు? కృష్ణుడే అసలైన తండ్రి. ఆయన తండ్రికి తండ్రి. ఆ తండ్రికి తండ్రి, ఆ తండ్రికి తండ్రికి తండ్రి. అలా ఆయన నుంచి తరతరాలుగా నీవరకు అందరికీ తండ్రి. మన వెనుక తరమున తండ్రిని ప్రయోగ పద్ధతుల ద్వారా తెలుసుకోలేనప్పడు ఈ పద్ధతిలో దేవుడిని, శ్రీకృష్ణ భగవానుని ఏవిధంగా తెలుసుకోగలవు? ప్రజలు ప్రయోగ పద్ధతి ద్వారా భగవంతుని అన్వేషించవచ్చు కాని ఎంత అన్వేషించినా కూడా వారు విఫలమవుతారు. అప్పడు వాళ్ళు అంటారు - "భగవంతుడు లేడూ. నేను భగవంతుడిని" అని. అయితే ఈశోపనిషత్తు భగవానుని ప్రయోగ పద్ధతి ద్వారా కాకుండా శ్రవణం ద్వారా తెలుసుకోవాలని చెప్తుంది. ఎవ్వరి నుంచి వినాలి? ఒక దుకాణ దారుని ద్వారానా? మత వాదుల ద్వారానా? కాదు ధీరుల నుండి వినాలి. "ధీర" అంటే భౌతిక ప్రభావం వలన ఇంద్రియాలు ప్రేరణ చెందని వాడు అని అర్థము.

కనుక నీవు నిజమైన జ్ఞానం కావాలనుకుంటే వేదములనబడే శాస్త్రముల నుండి జ్ఞానాన్ని పొందాలి. (వేద అనే పదానికి అర్థం జ్ఞానం అని). 108 ఉపనిషత్తులు వేదాలలో భాగాలు. వీటిలో పదకొండు చాలా ముఖ్యమైనవి. ఈ పదకొండింటిలో ఈశోపనిషత్తు ప్రధమ స్థానములో నిలుస్తుంది. "ఉపషనిషత్తు" అనే పదంలోని "ఉప" అన్నదానికి అర్థరం సమీపం అని. అందువలన ఈశోపనిషత్తులోని జ్ఞానం నిన్ను శ్రీకృష్ణుని సమీపానికి చేరుస్తుంది.

పండిత సంఘములో వేదాలను "శృతి" లేక ప్రాథమిక సాక్ష్యముగా ఆమోదించడం జరిగింది. వేదాలు కాలుష్యం చెందిన, బద్ధ జీవులు అన్వేషించి నిరూపించిన జ్ఞానం కాదు. ఆ మానవుల ఇంద్రియాలు సమగ్రమైనవి కావు. అందువలన వారు విషయాలను యధారూపంలో దర్శించలేరు వారు కేవలం "అది ఇలా ఉండవచ్చు, అది అలా ఉండవచ్చు" అని సిద్ధాంతీకరిస్తారు. అది జ్ఞానం

కాదు. జ్ఞానం అనేది ఏవిధమైన సందేహం, పొరపాటు లేకుండా స్థిరంగా ఉండేటటువంటిది. బద్ధ జీవులు తప్పిదాలు చేస్తారు. భ్రాంతికి లోనవుతారు. మోసం చేస్తారు. వారు ఏ విధంగా మోసం చేస్తారు? భగవద్గీతను అర్థం చేసుకోని వ్యక్తి దానిమీద వ్యాఖ్యానం వ్రాసి అమాయక ప్రజలను మోసగిస్తాడు. ఎవరో ఒకరికి పండిత అనే బిరుదు ఉంటుంది. అట్టి వారు భగవద్గీతకున్న ప్రాచుర్యాన్ని ఆసరాగా చేసుకుని దానికి వ్యాఖ్యానం రాస్తారు. అటువంటి నామ మాత్రపు పండితులు "ఎవరైనా తమ అభిప్రాయాలను వెల్లడించవచ్చు" అని అంటారు. అయితే భగవద్గీతలో శ్రీకృష్ణుడు తన భక్తుడు మాత్రమే గీతను అర్థం చేసుకోగలడని చెప్తున్నాడు. కనుక ఈ నామ మాత్రపు పండితులు మోసం చేస్తున్నారు.

సారాంశము ఏమిటంటే నీవు నిజమైన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పొందదలచుకుంటే నీవు పరమ సత్యాన్ని సాక్షాత్కారించుకొన్న ప్రామాణిక ఆధ్యాత్మిక గురువును ఆశ్రయించాలి.

**ప్రకృతి నియమాలు**

**కనుగొనుట :**

1. మనం జ్ఞానమును పొందుటకు గల రెండు మార్గములను తెల్పండి ?
2. వేదములు మన దగ్గరకు ఏవిధముగా వచ్చినవి ?
3. మనము ఎవరి దగ్గర నుండి వేదములను వినాలి ?

**అవగాహన :**

1. మనంతట మనము దేవునిని ఎందుకు అర్థం చేసుకోలేమో ఉదాహరణతో వివరించండి.
2. భగవంతుని గూర్చి ఏ సారస్వతములు మనకు యధార్థమైన జ్ఞానమును అందిస్తాయి? ఈ సారస్వతములు ఏవిధంగా పరిపూర్ణమైనవి?
3. భగవద్గీతను ఎవరు నిజముగా అర్థము చేసుకోగలరు? ఎందుకు?
4. మనము భగవద్గీతను ఎవరి వద్ద నుండి వినాలన్నది ఎంపిక చేసేటప్పుడు జాగురూకత వహించాలి?

**అనువర్తనము :**

1. మిమ్మలను భగవంతుని దగ్గరకు చేర్చగలిగే మార్గమును మీరు కనుగొన్నారా? మీ అనుభవములను పంచుకోండి.

## ప్రచారమే సర్వసారము

### ప్రచారకుని కృష్ణుడు గుర్తిస్తాడు

ఎవరైనా బద్ధ జీవులకు కృష్ణ చైతన్యవంతులగుటకు వారికి ఒక అవకాశము కల్పిస్తే, అతడి సర్వ కార్యకలాపములు దేవాదిదేవునిచే అనుమతించబడి ఆయనను అమితముగా ప్రసన్నము చేస్తాయి. పూర్వ ఆచార్యుల ఉదాహరణములను అనుసరించి కృష్ణ చైతన్య ఉద్యమము యందు సభ్యులందరూ బద్ధజీవులను కృష్ణచైతన్యవంతులుగా అగుటకు ప్రోత్సహించి, దానికి కావలసిన సౌకర్యములను ఇచ్చి వారికి లాభము చేకూర్చుటకు ప్రయత్నించాలి. అటువంటి కార్యకలాపములు చేయుటకు కృషి చేయు ప్రచారకుడు దేవాదిదేవునిచే గుర్తించబడతాడు. భగవద్గీత యందు స్వయముగా భగవంతుడు నిర్ధారించినట్లు : “ఎవరు పరమ రహస్యమును భక్తులకు వివరించునో, వారికి భక్తియుక్త సేవ నిశ్చయముగా లభించును మరియు అంత్యమున అతడు నా వద్దకు తిరిగి వచ్చును. ఈ ప్రపంచములో అతడికి మించిన ప్రియమైన భక్తుడు వేరొకడుండడు మరియు అతనికి మించిన ప్రియమైన వారు ఇంకొకరు ఉండబోరు”.

***శ్రీమద్భాగతము 6:4-44***